
S3

కథ

# పరిష్కారం

- వలివేటి నాగచంద్రావతి



చేతిలోని ఫోన్ రెస్ట్ మీద పెట్టేస్తూ "తాతగారు వస్తున్నారు" అని చెప్పి హడావిడిగా వెళ్ళబోతున్నదల్లా ఆగింది సుమిత్ర. "గదిలో మీ ఇద్దరి బుక్సూ ఆ పెద్ద కబోర్డ్‌లో సర్దేసుకోండి. చిన్నది తాతగారి బట్టలకీ, మందులవీ పెట్టుకోటానికీ సరిపోతుంది. స్టడీ టేబుల్ పక్కన మీ మంచాలున్నాయి కదా. తాతగారికి అటువైపు కాకుండా కిటికీ పక్కన వేస్తాను మంచం. మీకడ్డం లేకుండా- సరేనా" అంది వంటింటివైపు వెళ్ళిపోతూ.

పిల్లలిద్దరూ మొహామొహాలు చూసుకున్నారు. ఎప్పుడో ఓసారి చుక్క రాలినట్టు చూడ్డానికొచ్చి, ఎప్పుడొచ్చినా 'దేవతార్చనా సాలగ్రామాలూ' అంటూ ఒక్క రోజుకిమించి ఉండకుండా వెళ్ళిపోయే తాతగారు- పర్మినెంటుగా మంచం, బట్టలూ, మందులూ...

అన్నకేసి కళ్ళెగరేసింది సుష్మ సంగతేమిటన్నట్టు. కామ్‌గా చూసి గదిలోకి వెళ్ళిపోయాడు సురేష్. చేతిలో పుస్తకాలు సోఫాలోకి గిరవాటేసి తల్లి వెనకనే వంటింట్లోకి దూసుకెళ్ళింది సుష్మ.

"ఎన్నాళ్ళుంటారేం తాతగారు?"

"ఏమిటా ప్రశ్న- మర్యాద లేకుండా" చురుగ్గా చూసింది సుమిత్ర. అంతలోనే చల్లబడిపోయి "ముందు కాళ్ళూ చేతులూ కడుక్కురండి. హార్లిక్స్ కలిపిస్తాను" అంది స్టౌ వైపు తిరిగి.

సుష్మ కదలలేదు. "ముందు నేను అడిగిందానికి చెప్పు."

సుమిత్ర కూతురి వంక నిదానించి చూసింది. పిల్లలు పంతగించినప్పుడు చాలా ఓపిగ్గా ఉంటుంది ఆమె. "తాతగారు పెద్దవారయ్యారు. ఆరోగ్యం కూడా బావుండటం లేదు. ఇప్పుడు బామ్మ కూడా లేరు- తెలుసు కదా. అందుకనే నాన్న వెళ్ళారు- ఆయన్ని తీసుకువచ్చెయ్యటానికి" ఆగి, "ఆయనిక వెళ్ళరు. మనతోపాటే ఉంటారు."

తల్లి అంత వివరంగా చెప్పిందంటే అది ఇక నిర్ణయమైపోయిన సంగతన్నమాట. సుష్మ మెదలకుండా వాష్‌రూమ్‌కి వెళ్ళొచ్చి తల్లిచ్చిన కప్పులు రెండూ తీసుకుని గదిలోకి వచ్చేసింది.

"ఆయనిక్కడే మనతోపాటు ఉండిపోతారట."

సురేష్ ఒక్కసారి కళ్ళెత్తి చెల్లెలికేసి చూసి ఊరుకున్నాడంతే.

'వీడెప్పుడూ ఇంతే. నా మాటంటే మహా నిర్లక్ష్యం' మొహం చిట్లించింది సుష్మ. "ఉండటమంటే ఎక్కడో కాదు నాయనా- మన గదిలో. మ-న-గ-ది-లో" వెటకారంగా నొక్కి చెప్పింది.

"షటప్" ఒక్కసారిగా బరస్టయ్యాడు సురేష్. "నాకస్సలిష్టం లేదు ఆయనిక్కడుండటం."

అప్పటి కర్థమయింది సుష్మకి. ఆ కారణంగానే అన్న కోపంగా ఉన్నాడని.

"అవును, నాక్కూడా" అంది విచారంగా.

"నా గదిలో నువ్వుండటమే నాకిష్టముండదు. మళ్ళా ఆ ముసలాయనొకడా? పైగా పర్మినెంటుగా" అన్నాడు సురేష్ దూకుడుగా.

దెబ్బతిన్నట్టు చూసింది సుష్మ.

సురేష్ వెంటనే గ్రహించేశాడు తను నోరు జారానని. చప్పున స్వరం లబ్బుగా మార్చి "అహా, నువ్వంటే నా చెల్లివి. ఇంట్లో మెంబరువి. స్టడీస్‌లోనన్నా దేన్లోనన్నా షేర్ చేసుకుంటూండవచ్చు. మధ్యలో ఆయనెవరూ" అన్నాడు.

పాపం సుష్మ కాస్త మెతక. వెంటనే సమాధానపడిపోయి అన్నని క్షమించేసింది. "నిజమే అన్నా" అంది మద్దతిస్తూ.

"మనం ఇద్దరమే అనుకో ఏవో గేమ్సాడుకుంటాం కంప్యూటర్లో. ఎన్నో మాట్లాడుకుంటాం సినిమాల గురించి. ఆయనుంటే ఎంత ఇన్‌కన్వీనెంట్?"

"అవును. దగ్గులూ మందుల వాసన్లూ" సుష్మ వెగటు ముక్తాయించు.

"నీకు తెలుసా... ఈ ఓల్డ్‌మేన్ దగ్గరా, ఓల్డ్ ఉమన్ దగ్గరా ముసలికంపు కొడుతుందనీ."

"యాక్" సుష్మ వికారంగా మొహం పెట్టింది.

* * *

దీపాలు పెట్టేవేళ పరంధామయ్యగారిని వెంటపెట్టుకు వచ్చాడు మాధవరావు. సంభ్రమంగా ఎదురువెళ్ళింది సుమిత్ర. భర్త చేతిలోని సూట్‌కేస్ అందుకుని చిరునవ్వుతో మామగారిని "బావున్నారా మామయ్యా" అని పలకరించింది.

మామగారంటే చాలా గౌరవం, అభిమానం సుమిత్రకి. ఆయన శాంత స్వభావం... కూతుర్ని పిలిచినట్టు 'తల్లీ' అనో, 'అమ్మా' అనో పిలవటం... ఎంతో నచ్చుతాయామెకి.

ప్రయాణంలో అలిసొచ్చిన భర్తకీ మామగారికీ కావలసినవి అందిస్తూ, అమరుస్తూ పూర్తిగా పనిలో మునిగిపోయింది సుమిత్ర. అయినా కూడా పిల్లల తీరు ఓ కంట కనిపెడుతూనే ఉందామె.

తండ్రీ తాతా ఇంట్లోకి రాగానే హాల్లో ఉన్నవాళ్ళల్లా ఏదో కొంప మునిగిపోయినట్టు గదిలోకి వెళ్ళిపోయారిద్దరూను. తండ్రి పిలిస్తే ఇవతలికి వచ్చి, సుమిత్ర చాటుగా

కళ్ళెగరేస్తే 'హాయ్' చెప్పారు. రెండు నిమిషాలు మొక్కుబడిగా తాతగారి పక్కన కూర్చున్నారు. ఆయనడిగిన వాటికి పొడిపొడిగా జవాబులిచ్చారు. మళ్ళీ లోపలికి వెళ్ళిపోయారు.

'మామగారి మనసెక్కడ ఏ విధంగానూ నొచ్చుకోకుండా చూసుకోవాలనుకుంది తను. కానీ, ఈ పిల్లలేమిటీ...' కొద్దిగా కలవర పడింది సుమిత్ర.

రాత్రి అందరికీ ఒకేసారి భోజనాలకి ప్లేట్లు పెట్టింది టేబుల్ పైన. సురేష్ రాలేదు. "రికార్డ్ రాస్తున్నానమ్మా. రేపే సబ్‌మిట్ చేసెయ్యాలి. నేను తరవాత తింటాను. మీరు కానివ్వండి" అన్నాడు.

"నేనూ అన్నయ్యతోపాటే తింటాను" గారాంపోయింది సుష్మ.

సుమిత్ర మరోసారి బలవంతం చేయబోతే "చదువుకోనీలే అమ్మా, డిస్టర్బ్ చేయట మెందుకు" అని వారించారు పరంధామయ్య.

రాత్రిళ్ళు విడివిడిగా భోంచేసే అలవాటు ఆ ఇంట్లో ఎప్పుడూ లేదు. కొంచెం అనుమానంగా సుమిత్ర వైపు చూశాడు మాధవరావు. అంతే అనుమానంగా భర్త వైపు చూసింది సుమిత్ర.

రెండురోజుల్లోనే ఆ సంశయం నిజమే అని నిర్ధారణ అయింది. పరంధామయ్యగారి రాకని వాళ్ళిద్దరూ ఇష్టపడటం లేదు.

ఇలాంటివి నోరు తెరిచి మొహం మీద చెప్పక్కర్లేదు. ఆయన రాగానే మాటలాపేసి మొహం పక్కకి తిప్పుకోవటం చాలు. పనున్నట్టు లేచిపోవటం చాలు. ఆయన పిలిస్తే విననట్టు నటించడం చాలు. ఆయన వస్తువుల్నీ తాగిన గ్లాసు సైతం తాకరానివన్నట్టుగా ముట్టుకోకపోవటం, చిరాకుపడటం చాలు.

పదిరోజులు గడిచినా పిల్లల్లో అదే విముఖత, అదే అయిష్టత. సుమిత్ర చాలా బాధపడింది.

"అత్తమ్మ పోయినప్పట్నుంచీ పిలుస్తున్నాం. ఇంతకాలానికి మన దగ్గరుండటానికి ఒప్పుకున్నారు మామయ్య. ఆయన్ని నెత్తిన పెట్టుకు చూసుకోవాలని నేననుకుంటుంటే వీళ్ళేమిటండీ ఇలా పెడమొహం పెడుతున్నారూ" వాపోయింది భర్త దగ్గర.

"ఎందుకంటే వాళ్ళకి ఆయనతో అట్టే చనువు లేదు కాబట్టి. చూడు సుమిత్రా, పిల్లలు నాన్నని మనలో ఒకరిగా చూడటం లేదంటే వాళ్ళ తప్పేముంది చెప్పు? ఇంతకాలం నాన్నావాళ్ళు మన దగ్గరకొచ్చినా మనం వాళ్ళ దగ్గరికి వెళ్ళినా కేవలం చుట్టపు చూపే కదా! ఉన్నట్టుండి ఆయన్ని తీసుకొచ్చేసి మా పేరెంట్స్ కూడా మన ఫ్యామిలీయే, వాళ్ళూ మనతోపాటే ఉంటారూ అని మనమంటే వాళ్ళు జీర్ణించుకోవద్దూ"



అన్నాడు ఆనందరావు.

'భర్త మాటలు పిల్లల్ని సమర్థిస్తున్నట్టు ఉన్నా దాన్లో నిజమున్నట్టే ఉంది' నిట్టూర్చింది సుమిత్ర. 'ముందునుంచీ పెద్ద వాళ్ళతో కలిసుండకపోవటం, అనుబంధాలేర్పడకపోవటం వల్లే పిల్లలు ఇప్పుడిలా వాళ్ళంటే సహించలేకపోతూండవచ్చు. దూరం పెడుతూండవచ్చు. ఆ మాట నిజమే కావచ్చు కానీ, కుటుంబమంతా కలిసి ఉండటమనేది ఈ కాలంలో అందరికీ ఎలా సాధ్యపడుతుంది? ఉద్యోగరీత్యా తాము జిల్లాలే కాదు ఒకసారి రాష్ట్రం కూడా దాటారు. సొంత ఊరూ, సొంత ఇల్లూ, పొలమూ పుట్రా కామాటమంటూ అత్తమ్మా మావయ్యా గ్రామాన్నొదిలి రాలేదు. పిల్లలు ఊహ తెలిసినప్పుడు పల్లెటూరూ తాతగారి ఇల్లూ అంటే ఉత్సాహపడేవారు. ఎదిగేకొద్దీ ఆ సరదా తగ్గిపోయింది. 'కేబుల్ సరిగ్గా రాదూ, నెట్టూ లేదూ, డొక్కు సినిమా థియేటరూ' అంటూ సణుగుడు గొణుగుడు. రెండురోజులు ఉండటానికి బ్రహ్మప్రళయమయ్యేది. రానురానూ పిల్లల మూలంగానూ, దూరాభారమయీ తాము కూడా రాకాపోకా కొంత పరిమితం చేసుకోక తప్పలేదు. సహజంగా జరిగిపోయిన పరిణామం అది' మరోసారి నిట్టూర్చింది సుమిత్ర.

"అది సరే, ఇప్పుడేం చెయ్యటమని?"

"మనం తొందరపడ్డామేమోనని ఇప్పుడనిపిస్తోంది సుమిత్రా. ముందే మనం పిల్లల వైపునుంచి కూడా ఆలోచించాల్సింది. వ్యక్తిత్వం వస్తోన్న పిల్లలు, ప్రైవసీ కోరుకోవటం సహజం. ఇంకో బెడ్‌రూమ్ కూడా ఉంటే ఈ ప్రాబ్లమ్ కొంతవరకూ సాల్వ్ చెయ్యవచ్చనుకుంటున్నాను. కానీ, ఈ సిటీలో అన్ని సౌకర్యాలతో త్రీ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంటంటే సామాన్యం కాదు. నా బడ్జెట్‌లో దొరకటం ఇంకా కష్టం. చూద్దాం- మరీ ఎడ్జెస్టు కాలేకపోతే ఇంకో ఇల్లు దొరికేదాకా నాన్నని మళ్ళీ ఊరికి పంపించేద్దాం. దగ్గరే కాబట్టి వెళ్ళి చూస్తూండొచ్చు. ఏం చెయ్యగలమింక' తనకు తోచిన పరిష్కారం చెప్పేసి, సుమిత్ర మొహం బిగుసుకోవటం చూసి, "పోనీ ఇంకో దారేమన్నా ఉంటేతో నువ్వే చెప్పు" అంటూ 'నేను నిస్సహాయుణ్ణి' అన్నట్టు చేతులు దులిపేసుకున్నాడు మాధవరావు.

సుమిత్రకి భర్త ఎస్కేపిజం నచ్చలేదు. మామయ్యతో పిల్లలకి అంత సాన్నిహిత్యం లేకపోవచ్చు. మనకున్నది కదా. 'ఒరే, మిమ్మల్ని మేమెంత కంటికి రెప్పల్లా కాచుకుంటున్నామో, మమ్మల్నీ మా అమ్మా నాన్నా అలాగే అపురూపంగా చూసుకున్నార్రా- ఇప్పుడు వాళ్ళ అవసరం తీరిపోయింది కదా అని ఏదో సామెత చెప్పినట్టు తెప్ప తగలేయటం తప్పురా' అని పిల్లలకి బుద్ధొచ్చేలా చెప్పొద్దూ. 'పైగా పద్నాలుగేళ్ళకరికీ, పదహారేళ్ళకరికీ వచ్చాయో లేదో ఆ కుర్ర వెధవలకి ప్రైవసీలూ వ్యక్తిత్వాలూ అంటూ వకాలతు పుచ్చుకోవటమొకటా' మనసులోనే విసుక్కుంది సుమిత్ర.

అసలా దంపతుల మధ్య ఉన్న వ్యత్యాసమేమిటంటే మాధవరావు బుద్ధితో ఆలోచిస్తాడు. పరిస్థితులకి 'ఏం చేస్తాం' అని రాజీపడిపోతాడు. సుమిత్ర అలా కాదు. మనసుతో ఆలోచించి మథనపడుతుంది.

ఆమెకి అత్తవారిల్లన్నా అత్తమామలన్నా ఒకలాంటి సాఫ్ట్ కార్నరుంది. సుమిత్రకి తల్లి లేని కారణంగా పురుళ్ళూ, బాలెంతతనమూ అంతా అత్తవారింట్లోనే గడిచింది. ఆ సమయంలో అత్తమ్మ తన్నెంత శ్రద్ధగా అపురూపంగా చూసుకునేదనీ. పథ్యం, పానం అంటూ తల్లిలాగే ఎన్ని ఉపచారాలు చేసేదనీ...

మావయ్య మాత్రం- తనన్నా పిల్లలన్నా ఎంత వాత్సల్యమో. ఆ పల్లెటూరిలో కూడా తమకి అన్ని సౌకర్యాలూ అమర్చిపెట్టాలని ఎంత తాపత్రయపడేవారో. వారి ఆప్యాయ


## కలం కదిలించండి

సృజనాత్మకత కలిగిన రచయితలకూ రచయిత్రులకూ ఇదే ఆహ్వానం. మానవ జీవితంలోని విభిన్న పార్శ్వాలను స్పృశిస్తూ మధురమైన అనుభూతులను పాఠకులకు పంచే కథలకు 'ఈనాడు' స్వాగతం పలుకుతోంది. భావం ఏదైనా... కథనంలో వైవిధ్యం, పాఠకులను ఏకబిగిన చదివించగలిగే బిగువూ ఉండాలి. ఆశావహ దృక్పథంతో సాగే కథలకు ప్రాధాన్యం. కథ సాధారణ చేతి రాతలో ఏడు ఆర ఠావులకు మించకూడదు.

కథలు పంపాల్సిన చిరునామా:

ఆదివారం అనుబంధం
ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ,
హైదరాబాద్-82.

తలు ఎప్పుడు తలచుకున్నా మనసు ఉప్పొంగిపోతుంది సుమిత్రకి.

'మనం కన్నవాళ్ళ కోసం ప్రాణాలన్నా ఇచ్చేస్తామే... మనని కన్నవాళ్ళని కొంచెం ఆదరించుదామంటే ఎన్ని అవాంతరాలు, ఎన్ని అభ్యంతరాలు.'

★ ★ ★

ఆఫీసు పనిమీద ఓ పది రోజులపాటు ఢిల్లీ వెళుతున్నాడు మాధవరావు. అతని ప్రయాణానికి కావాల్సినవన్నీ సిద్ధంచేస్తూ తలమునకలుగా ఉంది సుమిత్ర. ఆదివారం ఆరోజు. పిల్లలు ఇంట్లోనే ఉన్నారు. తండ్రి ఫైల్సులో ముఖ్యమైన కాగితాలవీ సరిచేసు కుంటుంటే పక్కన చేరి వాళ్ళకి ఢిల్లీ నుంచి తెచ్చిపెట్టాల్సినవన్నీ ఏకరువు పెడుతున్నారు.

"తప్పకుండా తీసుకు రావాల్సిందే. వంకలు చెప్పకూడదు" అంటూ బతిమలాడు తున్నట్టుగానే బెదిరిస్తున్నారు.

"నేను కూడా మన ఊరు వెళదామను కుంటున్నాను మాధవా" సుమిత్ర తెచ్చిన కాఫీకప్పు అందుకుంటూ అన్నారు పరంధామయ్యగారు.

గతుక్కుమంది సుమిత్ర.

నిన్న సురేష్ 'ప్లీజ్ తాతకి నాతోపాటు వడ్డించకమ్మా. ఆయనట్లా జుర్రుకుంటూ తింటుంటే నాకసహ్యం' అని తనతో అనటం వినలేదు కదా! అప్పటికీ పిల్లల అయిష్టం ఆయన దగ్గర బయటపడకుండా శతవిధాలా ప్రయత్నిస్తూనే ఉంది. కానీ-

మాధవరావు మొహం కూడా వివర్ణ మైంది. చెయ్యకూడని నేరం తెలిసి కూడా చేస్తున్నట్టు అతని మొహం పాలిపోయింది.

తను భోపాల్‌లో చదువుకునేవాడు. ఆ రోజుల్లో సెలవులకు వచ్చివెళుతున్నప్పుడు ఎంతో ఆర్తిగా అడిగేవాడు నాన్న. 'మళ్ళీ ఎప్పుడు వస్తావ్ మాధవా?' అని. అంత ఆరాటంగా ఇప్పుడు తనడగ్గలడా? అది తనకే కృత్రిమంగా అనిపించదూ.

"ఈ పదిరోజులూ ఆగండి నాన్నా. నేను వచ్చాక తీసుకువెళతాను మిమ్మల్ని" తల వాల్చి మెల్లగా అన్నాడు మాధవరావు.

సుమిత్రలోనూ అదే అపరాధభావం. 'ముసలితనంలో ఒంటరితనం ఘోరమైన శాపం సుమిత్రా' అనేది అత్తగారు. మామగారిని వదిలి ఒక్కరోజు కూడా ఎక్కడా ఉండేది కాదావిడ. ఇప్పుడు అత్తమ్మ తోడులేని ఆ ఇంట్లో బిక్కుబిక్కుమంటూ మామయ్య ఒక్కరూ ఆ శాపాన్ననుభవి స్తోంటే, ఏ లోకాన్నున్నా అత్తమ్మ క్షమిస్తుందా తనని?' మనసు వికలం అయిపోతోంది సుమిత్రకి.

భర్తకి వీడ్కోలు చెప్పి పంపించింది. ఆలోచనలతో మనసు మనసులో లేదు. ఆ పరధ్యానంలోనే వంట మొదలుపెట్టింది సుమిత్ర. అన్యమనస్కంగా చేసేపని సవ్యంగా ఎలా పూర్తవుతుంది? పాలు పొంగాయి. కూర మాడింది. పప్పు అడుగంటింది. చిరాకుపడుతూ పచ్చడి కోసం మిక్సీలో ముక్కలు వేసింది. పరాగ్గా పవర్ ఆన్ చేసింది - తడిచేత్తో - పైగా ముందే లూజులూజుగా ఉన్న ఆ స్విచ్‌ని.

ఏమవుతుంది? షాక్. రాక్షస హస్తమేదో లాగి విసిరేసినట్టు గోడకు గుద్దుకుని కిందపడిపోయింది సుమిత్ర.

దబ్‌మన్న పెద్ద శబ్దానికి హాల్లో పేపరు చూస్తోన్న పరంధామయ్యగారూ, గదిలో వాదులాడుకుంటున్న సుష్మా, సురేష్ హడలిపోతూ వంటింట్లోకి పరిగెత్తారు.

స్పృహ లేదు సుమిత్రకి. తల్లోంచి రక్తం. నిశ్చేష్టులయ్యారు ముగ్గురూ.

పరంధామయ్యగారే ముందు తేరుకున్నారు. చప్పున దగ్గరగా వెళ్ళి నాడి చూశారు. తెలివి తప్పిందంతే. మొహాన నీళ్ళు



చిలకరించారు. మూలిగింది సుమిత్ర. ఊపిరి పీల్చుకున్నారాయన.

పిల్లల్లో అప్పుడొచ్చింది చైతన్యం. సుష్మ పెద్దగా ఏడుపు మొదలుపెట్టింది. సురేష్ పరిస్థితీ అంతకు తక్కువగా లేదు. అస్త వ్యస్తంగా పడివున్న తల్లి దగ్గరికి వెళ్ళటానికి ధైర్యం చాల్లేదేమో తాతని చుట్టుకుపోయింది సుష్మ. ఆసరా కావాలన్నట్టు ఆయన భుజం మీద తల వాల్చాడు సురేష్.

పిల్లలిద్దర్నీ రెండు చేతులా పొదువుకుని "ఫరవాలేదు నాన్నా, భయంలేదు తల్లీ" అంటూ ఆత్మీయంగా వెన్ను నిమిరారు పరంధామయ్యగారు. ఆ సమయంలో ఆ బాహుబంధం వారికో గొప్ప ఆలంబన అవ్వటమే కాదు- వారిలోని పరాయిభావాన్ని పూర్తిగా చెరిపేసింది.

ఎన్ని శిశిర వసంతాలనో దాటిన వయసు పరంధామయ్యగారిది. ఎన్ని కష్టసుఖాలనో చవిచూసిన అనుభవమాయనది. త్వరత్వరగా కర్తవ్య నిర్వహణలో పడిపోయారాయన.

షాక్ వల్ల శరీరం మొద్దుబారి ఉంటుంది. సుమిత్ర మూలుగుతోంది కానీ లేవలేక పోతోంది. పిల్లల సాయంతో ఆమెనెలాగో మంచం మీదికి చేర్చారు. తలకు తగిలిన గాయాన్ని శుభ్రం చేసి కట్టుకట్టారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటున్న డాక్టరుగారిని పిలుచుకు వచ్చి పరీక్ష చేయించారు. ప్రమాదం లేదని పించుకున్నారు. ఫోన్ చేసిన మాధవరావుకి- సుమిత్రకి కాస్త నలతగా ఉందని చెప్పి, 'ఆందోళన పడొద్దు, నేనున్నాను' అని భరోసా ఇచ్చారు.

అంతా బాగానే ఉందిగానీ వారం రోజులపాటు మంచం దిగలేకపోయింది సుమిత్ర- ఒళ్ళు నొప్పుల వల్ల.

ఈ వారంరోజులూ ఇల్లు నడిపే బాధ్యతంతా పరంధామయ్యగారిదే. తాతగారి వెంటవెంటే తిరుగుతూ ఆయనకింకో రెండు చేతులయ్యారు సురేష్, సుష్మా.

వంటా, ఇల్లు శుభ్రతా, సుమిత్రకి సేవా, మార్కెట్‌కి వెళ్ళటం, టీవీ చూడ్డం అన్నీ ముగ్గురూ కలిసే. తాతగారి పక్కదులిపి వేసేది సుష్మ. పూజకి పూలు కోసి తెచ్చి పెట్టేది. తాతగారికి కంప్యూటర్లో గేమ్సాడ్డం నేర్పేశాడు సురేష్. అన్నమయ్య పాటలు సెల్‌లో డౌన్‌లోడ్ చేసి తాతగారి చెవిలో ఇయర్‌ఫోన్ పెట్టి వినమని చెప్పేవాడు. రాత్రిళ్ళు ముగ్గురి మంచాలూ ఒక దగ్గరకు జరుపుకుని పడుకునేవాళ్ళు. మనుమలు నిద్రపోయేదాకా కథలూ కబుర్లూ చెప్పేవారు పరంధామయ్యగారు.

సుమిత్రకి నొప్పులూ నీరసమూ తగ్గాయి.

★ ★ ★

మాధవరావు ఢిల్లీ నుంచి తిరిగొచ్చాడు. ఇంట్లో సుమిత్ర మాత్రం ఉంది. స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్‌కి వెళ్ళారట అంతా. 'ఎంతాశ్చర్యం!'

"వారం రోజులు నొప్పులా నీకు?" నిక్షేపంలా ఉన్న భార్యని చూస్తూ అడిగాడు మాధవరావు.

అతనికి తెలిసి ఒక్కరోజూ నలతగా ఉందని పడుకుని ఎరుగదు సుమిత్ర. నూటరెండు జ్వరంలో కూడా స్నానం చేసి వంట చేసిన రోజులున్నాయ్.

"ఏం రాకూడదా?" కొంటెగా అడిగింది సుమిత్ర.

టవల్ భుజాన వేసుకుని స్నానానికి వెళ్ళ బోతూ "మరి, నాన్నని రేపు దిగబెట్టిరానా?" అన్నాడు మాధవరావు సందేహంగా.

"ఏమో, నాకేం తెలుసు... మీ పిల్లల్నడ గండి. ఒప్పుకుంటే పంపించి రండి" ఒకింత ధీమాగా- చిరునవ్వు నవ్వింది సుమిత్ర.

నిశ్చింతగా నిట్టూర్చాడు మాధవరావు. ★